ఆపద

సెలవులు విడిస్తే చాలు మా ఊరికి ఎపుడెపుడు పోదామా అని ఉరుట్లాగుతా వుండేది నేను.

నాకి మా ఊరంటే ఎంతిష్టమో మా యవ్వంటే అంతకంటే ఇష్టము. అసలు మా ఇల్లు ఊర్లో లేదు మరి. ఊరికి పడమటి దిక్కుకి, రొండు మైళ్ల దొవ్వులో ఉండాది.

ఆ అడవిలో ఇల్లు ...

ఇంటి ముందర వేప, చింతచెట్లు ...

ఇంటెనక రెండు దిగుడు బాయిలూ...

దాన్లకి ఒక పక్క చీనా చెట్లూ...

ఇంకొక పక్కన వరిమడి...

దాన్ల చుట్టూరా తుమ్మ చెట్లూ, కత్తాళీ...

మడికి చివరలో బంక ఇరిక్కాయల చెట్టూ...

ఇవన్నీ నన్ను రంగుల ప్రపంచంలోకి తీసుకపోయినట్లనిపిస్తాది. అందుకే మా ఊరన్నా, మా ఇల్లు అన్నా, మా యవ్వన్నా నాకి అంత ఇష్టము.

మా యవ్వకి తోడుగా ఎవరూ లేరు. ఆయమ్మ ఒక్కతే దెయ్యమా కట్ల బతుకుతాంటాది.

"ఒంటరిగా ఎట్లుంటావవ్వా?" అనడిగితే "పగలంతా కూలోల్లతో, రాత్రంతా దెయ్యాలతో మాట్లాడతానురా"... అంటానని నగుతాది. నిజ్జంగా ఆయమ్మ దెయ్యాలతో మాట్లాడే మనిషే అనిపిస్తాది. రేతిరి పూట ఆ చింపిరి జుట్టూ జూస్తే దెయ్యమే హడలు కదా మరి!

పెద్ద పరీక్షలు అయిపోయి, ఎండాకాలం సెలవులు మొదలయినాయి. ఆ పొద్దు పొద్దున్నే నేను మా ఊరికి జేరుకుండాను.

నేను వచ్చిననాని మా యవ్వకి సంతోషము సంతోషము గాదు. చిక్కని పాలతో కాఫీ జేసి ఇత్తడి

చెంబుకు పోసుకొని వచ్చి నట్టింట్లో పెట్టింది. ఇద్దరుమూ సక్కాబల్లం యేసుకోని తాగేకి కూకుండాము. ఆ చెంబులో యంత లేదన్నా ఆరుగలాసుల కాఫీ వుంటాది. చెరీ మూడు గలాసులు తాగేదన్న మాట. మా యవ్వకి కాఫీ పిచ్చి. దాన్ని నాకు గూడా అంటించినాది.

కడుపు నిండా కాఫీ తాగి చేన్లేకి ఎల్లబారితిమి. నేను అనంతపురం సుద్దులన్నీ జెప్తావుంటే, మా యవ్వ సంతోషంగా 'ఊ' కొడతా వుండాది. పగలంతా ఎట్ల గడిచిపోయిందో తెల్లు.

సందకాడ మొబ్బయితా ఉన్నెట్లే సెనిక్కాయ వురిమిండీ, రాగిముద్దా ఇంత మింగి బయట వుండే కుక్కి మంచం మింద కూకోని వుండాము.

పగలంతా ఊరికే మా యవ్వ యెంబడి తిరిగిందానికి అలుపు వచ్చినట్లు వుండాది నాకి, ఆయమ్మ జూస్తే పొద్దన్నించీ పనిజేస్తా వుంది. రొంతన్నా అలసిపోలా... మేతకు పొయ్యి వచ్చిన ఆవుల్ని కట్టేసింది. పాలు పిండింది. బుడ్డీ దీపం పట్టుకోని పోయి గడ్డి దొడ్డిలో నించి మేత తెచ్చి ఎద్దులకు వేసింది. ఇంట్లో దూరి యేందో ఎగబెడతా, సగబెడతా ఉండాది.

రెండు దినాల తర్వాత పున్నమేమో – వెన్నెల పాలారబోసినట్లుండాది.

ఇత్తడి గలాసు నిండా ఉడుకుడుకు పాలు తెచ్చి ఇచ్చి నా పక్కనే కూకుంది మాయవ్వ – వక్కాకు యేసుకుంటా. పాలన్నీ తాగేసినాక! "వక్కాకు నాకు ఇయ్యవ్వా!" అంటానని అడిగితి.

"ఊనికి వక్కాకు పిచ్చొకటి!" అంటానని గొణుగుతానే ఇచ్చింది వక్కాకు.

మా ఇంటికి కూత వేటు దూరంలో మా పెద్ద తాత ఇండ్లు మూడుండాయి. ఎన్నెట్లో ఆ మిద్దెలు తెల్లగా కనబడతా వుంటాయి.

వక్కాకు రసం మింగుతాంటే వేడికి పెయ్యంతా చిరుచెమట్లు పడతా వుండాయి.

చింత చెట్లు కాడ వున్నెట్లుండి బట్టావుయాలో అదో మాదిరి బుసలు కొడతా వుంది. ఏంటి కట్ల జేస్తా వుందో అర్థం కాలేదు నాకి. అప్పటిదంకా మా దగ్గిరే కూకోని వుండిన ఎర్రకుక్క జిమ్మిగాడు అక్కడికి పోయి మొరిగేది మొదలుపెట్టినాడు. ఆ మొరిగేదాంట్లో ఏందో ప్రమాదం వున్నెట్ల అనిపిస్తా వుంది నాకి.

మా యవ్వ గూడా పసిగట్టినట్లుండాది ఆ ప్రమాదాన్ని. 'నువ్వు మంచం మిందే వుండప్పయ్యా! నేను ఇప్పుడే చూసొస్తా' అంటానని బుడ్డీ దీపం పట్టుకోని పోయింది. చింతచెట్టు నీడలో వుండేదేందో కనిపెట్టేదానికి.

చెట్టు నీడలో పారజూస్తా వుంది బుడ్డీ వెలుతుర్లో. ఆ యమ్మ యేం జూస్తా వుండాదో తెల్దు. దెగ్గిట్లో వుండే కంది కట్టె చేతిలోకి దీసికోని నేలమింద సప్పిడి జేస్తా – "యాల వస్తివమ్మా! ఈడయేంది

తిందామని వస్తివే తిక్కదానా. అట్లపో, తినేదానికి దొరుకుతాది. పోయే... పోమ్మా... పోపో..." అంటూనే ముందుకు పోతా వుంది మెల్లగా. మా యవ్వతో పాటి జిమ్మిగాడు మొరుక్కుంటానే పోతా వుండాడు..

ఆయమ్మ ఏమిటితో మాట్లాడతా వుండాదా? అంటానని గబుక్కున మంచం దిగి మా యవ్వ కాడికి పరిగెత్తినా.

తీరా చూస్తే - అది నాగుంబాము.

బారెడు జంపు వుండాది.

నా రెట్టలావు వుండాది.

మెల్లగా వంపులు తిరుగుతా పోతా వుండాది.

మా యవ్వ కంది కట్టిని నేలకి రాపాడిస్తానే వుండాది. చీనా చెట్ల కల్లసాలలోకి పోతానే ఎనిక్కి తిరిగింది మా యవ్వ.

"ఆ పాముని పుట్టినింటికి సాగనంపినట్ల సాగనంపితివి, సంపితే పోయెగదవ్వా!" అనంటి.

"యేంటికప్పయ్యా! దాన్ని సంపేది. అదేం జేసిందిరా మనకి పాప్ప. దాని తిండి యాడన్నా దొరుకుతాదేమోనని యెతుక్కుంటా వచ్చిండాది". అనె మా యవ్వ.

"అది గాదవ్వా! దాన్ని అట్లే బతకనిస్తే ఎవుర్నన్నా కాటేస్తాది గదా!" అనంటి.

"ఏం లేదప్పా! అది ఊరుకూరికేనే ఎవుర్నీ కాటెయ్యదు. మనుసులం గదా... మనకి ముందు సూపు ఎక్కువరా! అందుకే అది కాటేస్తాది, ఇది కరుస్తాది, ఇంకొగటి కుడుతాది అంటానని అన్నిటినీ సంపేస్తా వుంటాము. అవీ మనట్లా ప్రాణాలే నప్పా...! అవిట్లకి మన మాదిరి ముందు సూపు లేదు పాప్ప! దాన్ల ప్రాణాల్ని కాపాడుకోనేకి మాత్రమే అవి కాటేస్తాయి. లేదంటే కుడతాయి. అంతకు తప్పా అనవసరంగా యానాడు మనకి అపకారం జెయ్యవు. అవన్నీ విషపురుగులనీ మనము తేలు కనబడితే సంపేదే - పాము కనబడితే సంపేదే, ఆకిరీకి జెర్రిపిల్ల కనబడినా సంపేదే! ఈ అడవిలో అన్నీ సంపుకుంటా పోతే ఎన్నని సంపాల్లప్పా? అసలు అన్నిటికంటే విషపురుగు మనిసేరా" అంటానే ఎనిక్కి తిరిగింది మా యవ్వ.

అవ్వతో పాటి నేనూ వచ్చి మళ్లీ మంచం మీద కూకుండాను. తోట చుట్టుపక్కల ఎంతెంత పెద్ద పాముల్ని ఎపుడెపుడు చూసి చెప్తా వుంది.

పాముల భయంతో కాళ్లు మంచం మిందే పెట్టుకోని శ్రద్ధగా వింటా వుండాను.

ఎక్కడి నించే ఎవురో కేకేసినట్లయింది. మా యవ్వ చెప్పేది ఆపేసి ఇనింది.

"ఎవురవ్వా!" అనడిగితి.

"ఎవురోనప్పయ్యా! మీ నడిపి తాతోళ్ల చేన్లో గొర్లోళ్లేమోరా! ఎవురి కోసరమో కేకలు యేస్తా వుండారులే!" అంటానని మళ్ళీ మళ్ళీ చెప్పేకి మొదలుపెట్టింది.

ఈసారి మరింత గట్టిగా – "ఓ పిన్నమ్మా" అంటానని కేక వినిపిచ్చె.

"అవ్వా నిన్నే – పెద్దవారాదప్ప చిన్నాయన పిలుస్తా వుండాడు. మిద్ది కాట్నించి!" అనంటి.

"అవున్రా నిజమే" – అంటానే మా యవ్వ గూడా "ఏమప్పయ్యో – వారాదీ! .. ఏమీ... అంట"నని గావుకేక పెట్టె గొంతు చీలిపోయేదట్ల.

అప్పుడు బదులు కేక దూసుకోని వచ్చింది – "ఓ పిన్నమ్మా ఊర్లో అగ్గి బడింది. అగ్గిబడిందీ బిరీన రా, రా!" అంటానని" "వస్తానప్పో! వస్తాను, వస్తాను" అంటానని మా యవ్వ తిరిగి కేక పెట్టె.

"పదరా పోదామి ఊర్లో ఇండ్లు అంటుకుండాయంట... ఎవురెవురిండ్లు కాలిపోయనో గదరా!" అంటానని గొణుగుతా బిరిబిరి ఇంటికి బీగము యేసి, చెప్పులు యేసుకోని యల్లబారె నేను మా యవ్వ యెనకే –

మా కుక్క జిమ్మిగాడు కూడా మాతో పాటే యల్లబారినాడు.

"నీకేం పనిరా ఈడ వుండకుండా యల్లబారతా వుండావు" అంటానని జిమ్మిగాన్ని కసిరింది.

అక్కడ కుక్కకీ, ఆవులకీ పాములకీ మా యవ్వ భాష బాగా అర్థమయితుందేమో మరి

జిమ్మిగాడు అట్లే ఆగిపోయినాడు.

మేమిద్దురుమూ మా పెద్ద తాతోళ్ళ మిద్దె కాడికి చేరేదప్పటికి ఆడ ఎవరూ పిల్లాకంత మనసి లేకుండా అప్పటికే ఊర్లేకి పోయినారు.

ఇంగేం జేసేదీ – మీ మిద్దురమే అవ్వా మనుమడూ ఊర్లేకి ఎల్లబారితిమి.

మిట్ట మిందికి పొయ్యేదప్పటికి ఊరు కనబడుతాంది. మాలగేర్లోనే అగ్గిబడినట్లు పెద్దగా వెలుతురు వస్తా వుండాది. అది జూస్తానే ఎద బాదుకొనేది మొదలు బెట్టె మా యవ్వ "ఇంగెట్లప్పా జేసేది... అంతా నాశనమైపోయ గదరా! మన గేరంత కాలిపోయేనప్పా! మనిల్లు కూడా కాలిపాయెరో.. కాలిపాయె.. మొన్ననే నాలుగు మూట్ల వడ్లూ, రెండు మూట్ల జొన్నలూ, అర్థమూట కందులూ ఆడ బెట్టి వస్తి గదరా అంతా కాలి బూడిదయిపాయె.. ఈడ వున్నా పున్నెమాకట్ల వుంటాండే గదరా!" అంటానని ఏడుపు గొంతుతో రాగాలు తీసి అంటా వుండాది.

మా యవ్వ మాటలకే నాకి గూడా ఏడుపొస్తా వుండాది.

"లేదు లేవ్వా! మనిల్లేమీ కాలిపోయిండదు" అనంటి. అట్లా అన్నానే గాని నాకి గానీ తెల్దు ఏందో మా యవ్వకి ధైర్యమిచ్చేకి అట్ల మాట్లాడినాను అంతే -

"అట్లే గానప్పా! నీ నోటి సలవతో అట్లే గానిరా" అనింది. కొంగుతో ముక్కు తుడుచుకుంటూ ఉరికెత్తినట్ల నడుస్తా వుంది. మా యవ్వ ఊరి దెగ్గిరికి పోతా వున్నెట్లే మంటలు మా ఇంటి పక్క కాదు, అన్నది మా యవ్వకి రూడి అయిండాది.

"మనోళ్ల ఇండ్లన్నీ కాలిపాయెరా - అంతా పాడయిపాయె గదరా! ఇంగేమి జేసేది, నలుమాలుగాని ఇల్లు కాలిపాయె నేమో, సన్న తిప్పగాని ఇల్లు కాలిపాయెనేమో, అంటానని మా యవ్వ తమ్ముళ్ళ ఇండ్లనీ, దెగ్గర బందువలు ఇండ్లనీ పేరుపేరున చెప్తా వుంది. ఏడుపు గొంతుతో.

తీరా మా గేర్లోకి పోయే తలికి అగ్గి బడిండేది ఆడగాదు, మాల గేరికి ఆవల వుండే గేర్లో నింటీ మంటలు కనబడతా వుంటాయి.

ఎవురేగాని ఇండ్లలో లేరు. అందరూ ఆడికే పోయి నట్లుండారు.

"లచ్చుమమ్మొదినా! పోతా వుండేది"- అన్న మాటలు పక్కనుండే ఇంటిలో నించి వచ్చినట్లయి తిరిగి చూస్తిమి ఇంటి వారు పాకలో వుండే అరుగుమింద దుప్పటి కప్పుకోనిండే ఆకారము కనిపించింది.

"నేనమ్మో వదినా ! ఓళేసప్పని". అంటానని ఆ ఆకారం "యాడన్నా! అగ్గిబదిండేది - మన గేర్లోననుకోని ఆదాబాద ఉరికెత్తుకుంటా వస్తిమన్నా - మేలే, మన గేరికాదు. నిజ్జంగన్నా! నాకయితే కాళ్ళూ జేతులూ సల్లగయి పోయె. మనోళ్ళంతా ఏమయిపాయెరో గదరా, అని నడుగు అంటుకోనిందన్నా! ఇప్పుడు పాపం కొంచెం కుదుటపడింది. యాడన్నా! అసులు అగ్గి బడిండేది. కుమ్మరోళ్ళ ఇండ్ల కల్లానా? అనడిగె మా యవ్వ.

"కాదొదినా! మాదిగ గేరిలో కొట్టాలు అంటుకుంటాయి. ఊరు ఊరంతా ఆడే వుందమ్మో.. నేను నడవలేను గదా అందుకే ఈడే ఉండిపోతి" అనె ఓళేసప్ప తాత.

"అట్లానా! అయ్యోయ్యో! యంత పనయ్యిందన్నా! నారాయణిగాడు ఎట్లుండాడో, ఆ పిల్లోని కొట్టం గీన కాలిపాయెనో, యేమో, వాడు గంపెడు పిల్లలుంటే వాడు పాప్మ యేమాయెనో గదప్పా!" అంటానని ఏడుపు గొంతుతో మాట్లాడుకుంటానే ముందుకు నడిచింది మా యవ్వ.

మాదిగ గేరిలో ఒక్క నారాయణప్ప మిందే ఎందుకంత ఇది. యాలంత బాధపడతా వుండాది. ఆ మాటే అడిగితే మా యవ్వని.

"వాడు మనింటి ఆయాగాడప్పా! మనకి చెప్పులు కుట్టేది ఆ పిల్లోడే. మన చేన్లో, తోట్లో యా పనికన్నా సరే పిలిస్తే సాలు - "వస్తాలేత్తా!" అంటానని చేతిలో పని పక్కకి పారేసి వస్తాడురా!

వానికి కడుపు నిండా పిల్లోల్లప్పా! ఐదుగురు ఆడ పిల్లోల్లు ఎట్లో గుట్టు చప్పుడు కాకుండా సంసారాన్ని ఎల్లీదు కొస్తావుండాడురా!" అట్లా వాని కొట్టం కాలిపోతే ఎట్లా అనేదేరా నా యదారంతానూ.." అనే మా యవ్వ.

"అంటే మాదిగ గేరంతా ఏమయి పోయినా పరవాలేదా?" అనడిగితి.

"నువ్వెక్కడోనివిరా! తిక్కోడా! అందరూ బాగుండాలప్పా! ఆపద ఎవురికి వచ్చినా బాధ పడతామురా! అదే మన దగ్గరోళ్ళకొస్తే ఎక్కువ బాధపడ్తాము. అట్లా ఆపద మనకి గానీ, మన వాళ్ళకి గానీ రాకూడదని కోరుకుంటాము." అనె మా యవ్వ.

అయిదు నిమిషాలలో మాదిగ గేరి జేరుకుంటిమి. ఆడ జూస్తే ఏడుపులు పెడబొబ్బలూ వినబడుతుండాయి. ఒక పక్క అయిదు ఇంకొక పక్క ఆరు కొట్టాలు నిలిచి కాలుతా వుండాయి. దాన్ల పక్కనుండే కొట్టాలు అంటుకొనే అవకాశాలు ఎక్కువగా ఉండాయి. అయితే నారాయణప్ప కొట్టాని కేమీ కానందుకు మా యవ్వ మనసు కుదుటపడింది.

అంటుకోనిండే కొట్టాల్ని ఆర్పేదానికి ఊరు ఊరంతా కష్టపడతా వుండాది. వాళ్ళలో కమ్మోల్లేమి, రెడ్లేమి, కురువోళ్ళేవి, ఈడిగోళ్ళేమి అన్ని కులాలోళ్ళూ వుండారు.

అక్కడ అంటరాని కులాలకు, అగ్ర కులాలకీ మద్దెన తేడాలు కనిపించలేదు.

రెడ్డి చేతిలోని బిందెని కురవాయప్ప తీసికొని పోతా వుండాడు. వైశ్యుల చేతుల్లోని కడవల్ని మాదిగోళ్ళూ, మాలోళ్ళూ తీసుకొని పోతా వుండారు.

వాళ్ళు మంటల్లో నీళ్ళు గుమ్మరిస్తా వుంటే యా మూలలోనూ ఆరిపోలేదు. అయినా పోస్తానే వుండారు నీళ్ళు. మాదిగ గేరి అంతా గోలగోలగా వుండాది.

ఒకవైపు పిల్లాజెల్లా ముసిలీ ముతకా లబలబమంటూ నోరు కొట్టుకుంటా వుండారు.

"ఏం పాడయిపోయె కాలమెచ్చెనర్రా! మా గేరికి... పాయనప్పా! అంతా పాయె... నాసిన మైపాయె ఇంగేమి జేసేదిరా బగమంతుడా! పిండీ నూకలు పాయె - జొన్నలు సద్దలు పాయె, బట్టా బాతా పాయే, కుండా సట్టీ పాయె. ఇంగేమి జేసేదప్పా" అంటానని ఒక ముసల్ది ఎదబాదుకుంటా పాదుకొని ఏడుస్తా వుంది. ఆయమ్మతో పాటి మా యవ్వ గూడా ఎద బాదుకుంటా వంత పాడతా వుంది.

కండ్ల ముందే అన్ని గుడిసెలు తగులబడతా వుంటే - ఎన్ని నీళ్ళు పోసినా మంటలు మరింత ఎక్కువయితా వుంటే ఏం చేయాలో ఎవురికీ తోచకుండా వుండాది.

అదృష్టమేమంటే గాలి లేదు. లేకుంటే ఆ గేర్లో వుండే ముప్పయి కొట్టాలు బూడిదయి పోయేవి.

అంతా అయ్యే తలికి అర్ధరాత్రి మీరిపాయె.

వచ్చేదప్పుడు మా యవ్వతో "అది కాదవ్వా! మామూలుగా అంటూ ముట్టూ అని ఉండే పెద్ద కులమోల్లు కూడా ఈ పొద్దు అవేమీ పట్టిచ్చుకోకుండా మాదిగోల్ల కొట్టాలు ఆర్పేకి వచ్చినారు. నిజంగా నాకి బలే సంతోషమయ్యింది. అంతా బాగ కలబడినారు కదవ్వా" అంటిని.

"ఏమనుకుంటివిరా! ఒక ఆపద వచ్చిందిరా అంటే అందరూ అట్ల కలబడి ఒకటి కావల్ల. ఆ ఆపద మాదిగోళ్ళది మాత్రమే కాదురా సన్నోడా! మాదిగ్గేరికి అవతల వుండే గడ్డిదొడ్డెండ్లన్నీ ఎవురివి అనుకుంటివి ? ఆ మంట లార్పే రెడ్డోళ్ళవీ, కమ్మోళ్ళవీ. అందుకే అంత అంటుముట్టు లేకుండ మంటలార్పుతా ఉండేది" అనింది మా యవ్వ ఎక్కడో పంటి కింద రాయి పడినట్లు అనిపించింది నాకి.

– "ప్రస్థానం" సాహిత్య ప్రత్యేక సంచిక, 2002